## క్లుప్తంగా

### యజమానులకు నోటీసులు

పెడన: పట్టణంలోని వాటర్ ప్లాంట్ల యజమానులకు మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య బుధవారం నోటీసులు జారీ చేశారు. వీటిని ఆయా వార్డు సచివాలయాల పరిధిలోని శానిటేషన్ ఎన్విరాల్‌మెంట్ కార్యదర్శులు ప్లాంట్ల నిర్వాహకులకు అందజేశారు. ఆ నోటీసులకు సంబంధించి లైసెన్సులు చూపాలని, నీటిని పరీక్షలు చేయించి తాగేందుకు అనుకూలంగా ఉన్నది లేనిది రిపోర్టులను ప్రతి 45 రోజులకు ఒకసారి తీసుకోవాల్సి ఉంటుందని తదితర వాటికి సమాధానాలు తెలియజేయాలని ఆ నోటీసులలో పేర్కొన్నారు. అలాగే శానిటేషన్ ఎన్విరాల్‌మెంట్ కార్యదర్శులకు కమిషనర్ మోమోలు జారీ చేశారు.

### నేడు విద్యుత్ నిలిపివేత

కృత్తివెన్ను: మండల పరిధిలోని ఉప్పులూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ఫీడర్ విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 6 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు పాశ్వాపురం, చినపాండ్రాక, ఉప్పులూరు, సీతారామపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ భాస్కరరావు తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

అవనిగడ్డ: నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను వైఎస్సార్ సీపీ యువనేత సింహాద్రి వికాస్ పంపిణీ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నలుగురు లబ్ధిదారులకు రూ.2.90 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజుల జయగోపాల్, నాయకులు చింతలపూడి బాలుతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### వడ్డీ రాయితీపై ప్రచారం

మచిలీపట్నంటౌన్: నగరంలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వడ్డీ రాయితీ ఇచ్చిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలంటూ మునిసిపల్ రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది బుధవారం కరపత్రాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ విభాగం అధికారులు బృందాలుగా విడిపోయి పన్ను బకాయిదారుల ఇళ్లకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ రాయితీ వివరిస్తూ కరపత్రాలు అందజేస్తున్నారు. ఈ నెల 31వ తేదీలోగా ఉన్న బకాయిలు చెల్లిస్తే వీటిపై ఉన్న వడ్డీ పూర్తిగా మాఫీ జరుగుతుందని వివరించారు.

### 20 లీటర్లు సారా స్వాధీనం

పెడన: పట్టణంలోని దక్షిణతెలుగుపాలెంలో సెబ్ అధికారులు, సిబ్బంది బుధవారం వేకువజామున దాడులు నిర్వహించారు. పెరుమాల రవి అనే వ్యక్తి నుంచి 20 లీటర్లు సారాను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. సెబ్ ఎస్పీ జి.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు సెబ్ ఎస్సైలు సిబ్బంది దాడులు నిర్వహించి 600 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 25 కేజీల బెల్లాన్ని, ఐదు కేజీలు అమోనియాను, ఒక కేజీ ఈస్ట్‌ను సీజ్ చేశారు. ఏపీ ప్రొహిబిషన్ యాక్టు ప్రకారం రవిపై కేసు నమోదు చేసినట్లు సెబ్ అధికారులు తెలిపారు.

### విద్యుత్ విజిలెన్స్ దాడులు

– రూ. 3 లక్షల జరిమానా వసూలు

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. గృహ, వాణిజ్య వినియోగ మీటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజిలెన్స్ జీఎం అల్ఫాన్స్, ఈఈ కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు 38 బృందాలుగా పర్యటించి దాడులు చేశారు. 598 గృహ సర్వీసులు, 1853 వాణిజ్య సముదాయాలు తనిఖీ చేశారు. వీటిలో 77 సర్వీసులకు అదనపు లోడు 107 కెడబ్ల్యూ, రెండు సర్వీసులకు నిర్దేశించిన కేటగిరీ కాకుండా వేరే కేటగిరీ వాడుతున్నందున రూ. 14 వేలు మొత్తం రూ. 3 లక్షలు అపరాధ రుసుం విధించారు. విద్యుత్ చౌర్యం చేయటం నేరమని ఇలాంటి చౌర్యానికి పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ చౌర్యం జరుగుతుంటే 9440812362, 9440812363 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. మచిలీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు, టౌన్ డీఈఈ కె.రామకృష్ణ, మచిలీపట్నం ఏఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధాశ్రమానికి సాయం

చల్లపల్లి: వృద్ధాశ్రమ నిర్మాణానికి విద్యార్థులు సహాయం అందజేశారు. స్థానిక నిమ్మలతోటలోని సీయోను వృద్ధాశ్రమ ఆవరణలో నూతన భవనం నిర్మాణానికి సెయింట్ మదర్ థెరిస్సా ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఆండ్రూ గోమ్స్, ప్రిన్సిపాల్ ప్రశాంతి గోమ్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది కలిసి టన్ను ఇనుము, వంద సిమెంటు బస్తాలు కొనుగోలు చేసేందుకు అవసరమయ్యే విరాళాన్ని అందచేశారు. దాతలకు ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావు ధన్యవాదాలు తెలిపారు.

### బాధితులకు పరామర్శ

ఘంటసాల: శ్రీకాకుళం శివారు సూరపనేని పాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత చిట్టూరి రమేష్ కుమార్తె సంగీత ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు రమేష్ ఇంటికి వెళ్లి రమేష్ సతీమణి చిట్టితల్లి, రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంగీతను పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

# ఎన్నికల్లో గెలుపే లక్ష్యం..



హంసలదీవి వేణుగోపాలుడి ఆలయం నుంచి నేతలు, కార్యకర్తలతో కలిసి ప్రచారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



హంసలదీవి గ్రామంలో తనకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

- ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే రమేష్‌బాబు
- హంసలదీవి వేణుగోపాలుడి ఆలయంలో తొలిపూజలు
- పార్టీ నేతలు, కార్యకర్తలు, కుటుంబసభ్యులతో కలిసి ప్రచారం

కోడూరు: అవనిగడ్డ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జీ, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తన ఎన్నికల ప్రచారాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. హంసలదీవి వేదికగా బుధవారం ప్రచారానికి శ్రీకారం చుట్టారు. రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారికి తొలి పూజలు చేసి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, కుటుంబసభ్యులతో కలిసి రమేష్‌బాబు ప్రచారంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99శాతంకు పైగా నేరవేర్చారని, అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ పథకాలను అమలు చేశారని రమేష్‌బాబు తెలిపారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా కూడా జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హంసలదీవిలో సింహాద్రి రమేష్‌బాబు తన సతీమణి కెప్టెన్ లక్ష్మి, కుమారుడు వికాస్‌తో పాటు పార్టీ జిల్లా రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జీ కడవకొల్లు నరసింహారావుతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారం కృషి చేశానని, మరోసారి తనను తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని గ్రామస్తులను అభ్యర్థించారు. ముందుగా వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు చేసి, స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రతినిధులు రమేష్‌బాబు దంపతులకు ప్రసాదాలు అందించి, శాలువాతో సత్కరించారు. పార్టీ నేతలు బాణసంచా కాల్చి అభిమానాన్ని చాటుకున్నారు. ఎంపీటీసీలు కొండవీటి వెంకటకుమారి, తుంగల సుమతి దేవి, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్లు పరిశె మాధవరావు, రేపల్లె శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు, గ్రామ కన్వీనర్లు, ఆరు మండలాలకు చెందిన నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

దక్షిణచిరువోలులంక(అవనిగడ్డ): మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంకలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఎన్నికల ప్రచారాన్ని బుధవారం ప్రారంభించారు. ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, పార్టీ యువనేత సింహాద్రి వికాస్‌తో కలసి ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి చెప్పాండంటే చేస్తాడంతే కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు సనకా సుబ్రహ్మణ్యం, దాసరి విజయ్‌కుమార్, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరవరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, గ్రామ కన్వీనర్ బచ్చు నాగమల్లేశ్వరరావు(బుజ్జి), పార్టీ నాయకులు బుస్సా కిశోర్, అచ్చుతరామయ్య, బడే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం(ఘంటసాల): గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామం బీసీకాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు, ఎస్ఆర్‌జీఎస్ నిధులు రూ.6 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే రమేష్ బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ అభివృద్ధి లేదని ప్రతిపక్షాలు ఆరోపణలు చేయడం బాధకరమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి సంక్షేమం ముందంజలో ఉందన్నారు. యువనేత సింహాద్రి వికాస్, ఘంటసాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ వేమూరి వెంకట్రావు, ఘంటసాల, అవనిగడ్డ జడ్పీటీసీలు తుమ్మల మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ, సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, నేతలు చిట్టూరి రమేష్, తిరుమలశెట్టి సీతారాం బాబు, ఆత్కూరి సీతారామరాజు, తుంగల మునసలయ్య, వాసు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాలశౌరికి రాజకీయ భిక్ష పెట్టింది వైఎస్సార్

- సీఎం జగన్ రెండోసారి అవకాశం ఇచ్చారు
- ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి
- బాలశౌరికి ఎమ్మెల్యే సింహాద్రి హెచ్చరిక
- బందరు పార్లమెంట్‌తో సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీదే విజయం



దక్షిణచిరువోలులంకలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: రాజకీయ భిక్ష పెట్టిన కుటుంబంపైనే ఎంపీ వల్లభనేని బాలశౌరి విమర్శలు చేయడం సిగ్గుచేటని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడక పోతే గట్టిగా బుద్ధి చెబుతామని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు హెచ్చరించారు. మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంకలో బుధవారం ఎమ్మెల్యే సింహాద్రి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బాలశౌరికి రాజకీయ భిక్ష పెట్టింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అయితే రెండో సారి అవకాశం ఇచ్చింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అలాంటి వారిపై విమర్శలు చేయడం ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. నిన్నటి వరకూ వైఎస్సార్ సీపీలో ఉన్న ఆయన తన స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారి వైఎస్సార్‌సీపీనే విమర్శించడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీని వేటాడుతాం అంటూ ప్రగల్భాలు పలుకుతున్న బాలశౌరిని ఓడించేందుకు ప్రజలు వెంటపడి వేటాడేరోజు దగ్గరలోనే ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగిస్తుందని ఎమ్మెల్యే సింహాద్రి పేర్కొన్నారు. సమావేశంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు సింహాద్రి వికాస్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పంపిణీ



డాక్యుమెంట్లును అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి, పక్కన కౌన్సిలర్లు

పెడన: కనివిని ఎరుగని రీతిలో నవరత్నాల వంటి పథకాలను మ్యానిఫెస్టోలో పెట్టి చెప్పిన మాట..ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు ఇళ్లు ఇవ్వడమే కాకుండా వాటిని రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చిన మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా నిలబెట్టుకుందామని పెడన పురపాలక సంఘ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. బ్రహ్మపురంలోని 9వ సచివాలయంలో బుధవారం 22, 23వ వార్డులకు సంబంధించిన ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లును అందజేశారు. ఈ సందర్భంగా నాగకుమారి మాట్లాడుతూ పైసా ఖర్చు లేకుండా ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా ఇంటిని నిర్మించుకోవడానికి మెటీరియల్ ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పరంగా రిజిస్ట్రేషన్ చేయించడం అభినందనీయమని చెప్పారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా పేదలకు భారీగా ఇళ్ల స్థలాలు ఇచ్చిన సందర్భాలు లేవన్నారు. అనేక సంక్షేమ ఫలాలను నేరుగా అందించిన మన జగనన్నను మళ్లీ మళ్లీ సీఎంగా నిలబెట్టుకోవడానికి మహిళలంతా కృత నిశ్చయంతో ముందుకు అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉమ్మిటి తనూజ, మెట్ల సుబ్రహ్మణ్యం, రెహతున్నీసా, కొసనం కరుణకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పేదల పెన్నిధి సీఎం జగన్

పేర్ని కిట్టు



మాట్లాడుతున్న పేర్ని కిట్టు చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు

మచిలీపట్నంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పెన్నిధిగా నిలిచారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. రుద్రవరంలో నిర్మించిన 243 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాల ద్వారా ఆదుకున్న ప్రభుత్వం మునుపెన్నడూ చూడలేదన్నారు. ప్రతి ఇంటికీ ఆయన మేలు చేశారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే జగనన్న కాలనీల్లో నివేశనా స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించారన్నారు. డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మీ, శీలం బాబ్జి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కమిషనర్ బాపిరాజు, కార్పొరేటర్లు రాసంశెట్టి వాణిశ్రీ, యండ్రపాటి నాగేశ్వరరావు, ఐనం తాతారావు, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసమ్మ, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ చింతా మోనిక, టిడ్కో ఎఈ గణేష్‌బాబు, టిడ్కో ప్రతినిధి నాగరాజు, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ మొహమ్మద్‌సాహెబ్, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: రాబోయే ఎన్నికలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డిని మరో మారు ఆదరిస్తే అన్నలా అందరినీ ఆదుకుంటాడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు తెలిపారు. బందరు మండలం తాళ్లపాలెం గ్రామంలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా కిట్టు గ్రామంలోని పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలుపై అవగాహన కల్పించారు. గ్రామంలో సమస్యలపై ఆరా తీశారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, గ్రామ సర్పంచి మదిరి అశ్విని, శ్రీకాకుళం నాగేశ్వరరావు, ఇతర గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువగా ప్రభుత్వ సేవలు...

గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువచేస్తుందని బందరు శాసనసభ్యుడు, రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) తెలిపారు. బందరు మండలం కానూరు గ్రామంలో రూ. 43 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయంను బుధవారం పేర్ని నాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వపరమైన సేవలను పొందాలంటే గతంలో సుదూర ప్రాంతమైన పట్టణానికి వెళ్ళాల్సివచ్చేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పాలన ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించాలనే సంకల్పంతో గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వం కార్యరూపం దాల్చలేని సచివాలయం వ్యవస్థను అమలులోకి తీసుకొచ్చారని చెప్పారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ చెక్కా లక్ష్మి, ఉపసర్పంచ్ గోపు మురళీ, గ్రామ ఇన్‌చార్జ్ చెక్కా ఏడుకొండలు, కానూరు పిఎసిఎస్ అధ్యక్షుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విస్తృత తనిఖీలు చేస్తున్నాం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీతాభాయ్



ఆసుపత్రి పరిశీలిస్తున్న డాక్టర్ గీతాభాయ్

చల్లపల్లి: ప్రైవేట్ ఆసుపత్రులు, పరీక్షా కేంద్రాలు నిబంధనల ప్రకారం నిర్వహించేలా జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేస్తున్నట్లు డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ జి.గీతాభాయ్ అన్నారు. కీర్తి హాస్పిటల్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఏఆర్‌టీ చట్టం ద్వారా సహాయ పునరుత్పత్తి సాంకేతిక కేంద్ర ఏర్పాటుకు అనువైన సదుపాయాలు, ఏర్పాట్లు పరిశీలించారు. అసిస్టెంట్ రీ–ప్రొడక్టీవ్ టెక్నాలజీ ప్రజల్లో ఉన్న వంధ్యత్వం పరిష్కారానికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఏఆర్‌టీ ద్వారా సంతాన ఉత్పత్తి చికిత్స చేయటానికి అవసరమైన మానవ వనరులు, యంత్ర సామగ్రి, సాంకేతిక పరికరాలు పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందించే వైద్య సేవలు, ధరల పట్టిక పరిశీలించారు. తనిఖీ బృందం సభ్యులు డాక్టర్ బి.శృతి, డాక్టర్ వినీల, డాక్టర్ గౌతమి, పి.మస్తానమ్మ, బి.రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం

చల్లపల్లి: గ్రామ పంచాయతీ సాధారణ నిధులతో బుధవారం చల్లపల్లి నారాయణరావు నగర్‌లో రెండు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. గ్రామ పంచాయతీ సాధారణ నిధులు రూ.2.20 లక్షలు, రూ.3.05 లక్షలతో కాలనీలో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, మాజీ వైస్ ఎంపీపీ మెండు ఏడుకొండలు, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాల ఆదాయం రూ. 7.70 లక్షలు



కృత్తివెన్ను శివాలయం హుండీ లెక్కింపులో అధికారులు

కృత్తివెన్ను: కృత్తివెన్నులో ప్రసిద్ధి గాంచిన దుర్గా పార్వతీసమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఇటీవల జరిగిన మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా రూ. 7.71 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు సమక్షంలో బుధవారం హుండీ లెక్కించారు. అభిషేకాలు ద్వారా రూ. 15,400, ప్రత్యేక దర్శనం రూ.62,020 అంతరాలయ దర్శనం రూ. 1,45,150, కానుకల ద్వారా రూ. 1,39,566, కేశఖండన రూ. 690 వాహన పార్కింగ్ రూ. 29,500, తాత్కాలిక షాపుల అద్దె రూ. 47,500 హుండీ వలన రూ. 3,27,893 మొత్తం రూ. 7,71,159 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరం రూ. 78,440 ఆదాయం అదనంగా వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పట్టపు నాగేశ్వరరావు, అర్చకులు మురళీకృష్ణశర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



జెడ్పీ హైస్కూల్ టీమ్‌కు షీల్డ్, గోల్డ్‌మెడల్స్ అందిస్తున్న వేణుగోపాలరావు

గోగినేనిపాలెం(ఘంటసాల): ఏపీ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో గోగినేనిపాలెం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభకనబర్చి విజేతలుగా నిలవాలని హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు అన్నారు. ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఉమ్మడి కృష్ణా జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెలక్షన్ ట్రైల్స్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి ఎనిమిది సాఫ్ట్‌బాల్ జట్లు పాల్గొనగా గోగినేని పాలెం హైస్కూల్ విద్యార్థులు మొదటిస్థానం కైవసం చేసుకోగా, ద్వితీయస్థానంలో పల్లెర్లమూడి జడ్పీ హైస్కూల్ టీమ్, తృతీయస్థానంలో ఉయ్యూరుకు చెందిన ఫ్లోరా ఇంగ్లీషు మీడియం హైస్కూల్ టీమ్ నిలిచింది. మొదటిస్థానం పొందిన గోగినేని పాలెం జడ్పీ హైస్కూల్ జట్టు అనంతపురంలో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయిలో జరిగే సాఫ్ట్‌బాల్ పోటీల్లో కృష్ణా జిల్లా తరుపున ఆడనున్నట్లు చెప్పారు. అనంతరం ఆయా జట్లకు గోల్డ్ మెడల్స్, షీల్డ్‌లు అందించి విజేతలను అభినందించారు. సెలక్షన్ కమిటీ సభ్యులు, హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ గరికిపాటి మారుతీ, జిల్లా కోచ్ రాయన సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను శ్రీకాకుళం, నాగాయలంక జెడ్పీ హైస్కూల్స్ ఫిజికల్ డైరెక్టర్లు బడే వెంకటేశ్వరరావు, గాజుల ప్రసాద్‌లు నిర్వహించారు.

## ఆశీలు హక్కులకు వేలం

చల్లపల్లి: రోజువారీ ఆశీలు వసూలు చేసుకునే హక్కులకు పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈఓ పేర్ని మాధవేంద్రరావు పాట నిర్వహించగా, బొండాడ బసవేశ్వరరావు రూ.9,75,000 కు ఆశీలు వసూలు హక్కులు పొందారు.

# వైఎస్సార్ సీపీలో పలువురు చేరిక



ఉప్పాల రాము ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కండువాలు కప్పుకున్న టీడీపీ శ్రేణులు

గూడూరు: మండల కేంద్రంలో టీడీపీకి చెందిన 40 కుటుంబాలు బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఉప్పాల రాము మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. ఇలాంటి తరుణంలో గూడూరులో ఇంత పెద్ద ఎత్తున మహిళలు మేము సైతం అంటూ జగనన్నకు మద్దతు పలకటం అభినందనీయమని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ఎనుమలు వెంకటేశ్వరరావు, పామర్తి పిచ్చన్న, నరసమ్మ, కోడూరు శ్రీను, బాపనయ్య, మోపిదేవి సాయి, ఉయ్యూరు మోహనరావు, శివకృష్ణ, జుజ్జువరపు రహమతుల్లా, రెబ్బా కోటేశ్వరరావు తదితరులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్‌రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, పార్టీ గూడూరు మండల కన్వీనర్ పర్లం మహాలక్ష్మయ్యనాయుడు, లింగం విజయ్, మాగంటి నాగరాజు, ఉదయ్, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్సీ కరకట్ట నిర్మాణ పనులు ప్రారంభం

మోపిదేవి: మోపిదేవి నుంచి అయోధ్య పోవు ఆర్సీ కరకట్టపై చిరువోలు కూడలి వరకు రోడ్డు నిర్మాణ పనులకు మెరకనపల్లి గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి పూజలు నిర్వహించి, బుధవారం పనులు ప్రారంభించారు. గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ అనూష మాట్లాడుతూ 1.40 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు రూ. 5 లక్షలతో పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు పాల్గొన్నారు.

### డాక్టర్ చంద్రశేఖర్‌కు అండగా ఉంటాం

నాగాయలంక: వైఎస్సార్ సీపీ బందరు పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమితులైన డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌ను నాగాయలంక మండలానికి చెందిన ఆపార్టీ కృష్ణా జిల్లా యూత్ సెల్ కార్యదర్శి ఆకుల బాబీ కుమార్ అభినందించారు. బుధవారం బాబీ అవనిగడ్డలోని సింహాద్రి స్వగృహంలో ఆయనను కలసి పుష్ప గుచ్చం అందచేసి, శాలువాతో సత్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ అడగుజాడలతో ప్రతి కార్యకర్త విజయానికి కృషి చేస్తారని ఈదిశగా యూత్ విభాగం ముందంజలో ఉంటామని బాబీకుమార్ చెప్పారు.

## సంక్షిప్త వార్తలు

### సీఎం నిర్ణయం అభినందనీయం

పెడన: జర్నలిస్టులకు స్థలాలు ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. బుధవారం కౌన్సిల్ అత్యవసర సమావేశంలో పురపాలక సంఘ పరిధిలో ఎన్టీఆర్ కాలనీలోని 53 సెంట్లు స్థలాన్ని రెవెన్యూ వారికి కేటాయిస్తూ జర్నలిస్టులకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అజెండాలో పొందుపరిచిన అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ జర్నలిస్టుల స్థల విషయంలో కౌన్సిల్ సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేయడం సంతోషకరమన్నారు. తొలుత మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన బి.మహేంద్రకు కౌన్సిల్ సంతాపం వ్యక్తం చేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించింది. అనంతరం కొత్తగా బాధ్యతలను స్వీకరించిన కమిషనర్ వెంకటరామయ్య కౌన్సిల్ సభ్యులను పరిచయం చేసుకున్నారు. అజెండాలోని పలు అంశాలపై చర్చ జరిగింది.

### పెడన పోలీస్‌స్టేషన్ పరిశీలన

పెడన: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ పత్రాలను భద్రపరిచే గది పెడన పోలీస్ స్టేషన్‌లో ఉండటంతో బుధవారం మధ్యాహ్నం పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఈఆర్వో) పి.వెంకటరమణ పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ భద్రతపై అక్కడ ఉన్న సిబ్బంది నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లు వచ్చిన తరువాత వాటిని భద్రపరచడం , ఆ తరువాత వాటిని ఎప్పుడు ఎక్కడ అందజేయాలనే దానిపై స్పష్టత వచ్చే వరకు భద్రతపై చేపట్టాల్సిన చర్యలపై అక్కడ సిబ్బందితో చర్చించారు. తొలుత ఈఆర్వో వెంకటరమణ, పెడన సర్వేయర్ కృష్ణాలతో పాటు పలువురు సిబ్బంది లెక్కింపు కేంద్రమైన కృష్ణా యూనివర్సిటీలోని పెడన నియోజకవర్గానికి కేటాయించిన గదులను, ఏ విధమైన ఏర్పాట్లు చేపట్టాలనే దానిపై పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికల ప్రకటన జారీ అవ్వగానే ఎన్నికల విధులు పూర్తిస్థాయిలో చేపడతామని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### నగరాభివృద్ధే ధ్యేయంగా పనులు

మచిలీపట్నంటౌన్: నగరంలో అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు వసతులు కల్పించే దిశగా పనిచేస్తున్నట్లు మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. 37వ డివిజన్ కేశవరావుతోటలో బుధవారం సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో సిమెంటు రోడ్లు, పక్కా డ్రైయిన్లు నిర్మించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 20 కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో నగరంలో దాదాపు 75 పనులను చేపట్టామని పేర్కొన్నారు. అన్ని డివిజన్లలో ప్రధాన సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మీ, శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, ఆ డివిజన్ కార్పొరేటర్ ఐనం తాతారావు, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసీ పాల్గొన్నారు.

### నగరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 16, 48 డివిజన్లలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. 16వ డివిజన్‌లో రాజాగోల్డ్ సందులో, 48వ డివిజన్‌లో సచివాలయం వద్ద రెండో శిబిరాలు ఏర్పాటుచేశారు. ఈసీజీ, రక్త తదితర పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 16వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ భోగిరెడ్డి వెంకటేశ్వర్లు, 48వ డివిజన్ కార్పొరేటర్ ముచ్చర్ల శైలజ, డివిజన్ ఇన్‌చార్జ్ చందు పర్యవేక్షించారు.